## క్లుప్తంగా

### వైభవంగా చంద్రమాణిక్యాలమ్మ ఉత్సవాలు



అమ్మవారి గుడి వద్ద ప్రదర్శనలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో గ్రామ దేవత చంద్రమాణిక్యాలమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 27వ తేదీతో ముగుస్తాయి. దాదాపు 15 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీనిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని అరిణాం అక్కివలస పరిధిలో ఉన్న శ్యాంక్రిక్ పిష్టస్ పరిశ్రమలో పనిచేస్తున్న రెడ్డి సూర్యారావు అనే కార్మికుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు రూ.1,07,500లు చందాలుగా పోగు చేశారు. ఈ ఆర్థిక సాయాన్ని మృతుని భార్య బాలకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ, యూనియన్ నాయకులు సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రేపు అరసవల్లిలో త్రీ మెన్ కమిటీ సమావేశం



అరసవల్లి దేవాలయం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో దినసరి వేతనదారుల సమస్యను పరిష్కరించే క్రమంలో అవసరమైన మేరకు సిబ్బంది సంఖ్యను ఖరారు చేసేందుకు త్రీ మెన్ కమిటీ సభ్యులు బుధవారం సమావేశం కానున్నారు. దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దినసరి వేతనదారులకు జీతాలను చెల్లించిన ఆలయ అధికారులు, ఇప్పుడు ఆలయానికి అన్ని విభాగాల్లో అవసరమైన ఉద్యోగుల సంఖ్యను ఖరారు చేసేందుకు ఔట్ సోర్సింగ్‌కు అనుమతించేలా నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఈ త్రీమెన్ కమిటీలో విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్, ఆలయ ఈవో వై.భద్రాజీలు ఉన్నారు. అయితే ఇటీవలే కొద్దికాలం ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఈవో శోభారాణి ఈ దినసరి వేతనదారుల అవసరాలపై ఓ నివేదికను రాష్ట్ర కమిషనర్‌కు అందజేసినట్లుగా తెలుస్తోంది.

### బాలల్లో సృజనాత్మకత గుర్తించాలి



పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: బాలల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అన్నారు. నగరంలోని బలగ హడ్కో కాలనీలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం ఉదయం పిల్లలకు నీతి పద్యాలు, నీతి కథలు చెప్పారు. అనంతరం విద్యార్థుల జ్ఞాపక శక్తిపై పోటీలు నిర్వహించారు. పోటీలో 27 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం దారుణం



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 26 మందిని కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం దారుణమని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కేశవరావు అనారోగ్యంతో ఒడిశాలో చికిత్స పొందుతుండగా పట్టుకొని ఛత్తీస్‌గఢ్ పోలీసులు కాల్చివేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించడం సరికాదన్నారు. కేశవరావు తదితరులు చనిపోయి ఐదు రోజులు అవుతున్నా వారి మృతదేహాలను బంధువులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో కామ్రేడ్ గణేష్ పండా, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ తాండ్ర అరుణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల కాలం.. పశువులు భద్రం



అల్లినగరం వద్ద మేత మేస్తున్న గొర్రెలు

- తొలకరి సమయంలో వ్యాధులు సోకే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే పశువుల ప్రాణాలకే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు



ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఎచ్చెర్ల: వర్షాకాలం వచ్చిందంటే పశువులపై వ్యాధులు దాడి చేస్తాయి. అందులోనూ ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందుగానే పడుతున్నాయి. ఈ కాలంలో పశువుల సంరక్షణ చర్యలు ఎంతో అవసరం. అందుకే పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. ఏదైనా వ్యాధి సోకినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా సమీపంలోని పశువైద్యశాలను సంప్రదించాలని చెబుతున్నారు. ఒకవేళ జీవం పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, అస్పత్రికి తరలించలేని పరిస్థితిలో ఉన్నా 1962 నంబర్‌కు కాల్ చేయాలంటున్నారు. పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం దగ్గరలోని పశువైద్యశాలకు తరలించాలని సూచిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల మండలానికి సంబంధించి ఆవులు 16,345, గేదెలు 390, గొర్రెలు 16,369, మేకలు 7,717 ఉన్నాయి. లావేరులో ఆవులు 24,362, గేదెలు 2,091, గొర్రెలు 25,862 మేకలు 8940 ఉండగా, జి.సిగడాం మండలంలో ఆవులు 15,157, గేదెలు 2,592 గొర్రెలు 11,862 మేకలు 6,430, రణస్థలం మండలంలో ఆవులు 14,722, గేదెలు 2,584, గొర్రెలు 32,680, మేకలు 12,862 ఉన్నాయి.

**నట్టలతో ఎదుగుదలకు బ్రేక్**

గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు సులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. గొర్రెలు తిన్న ఆహారమంతా సులి పురుగులే తినేయడంతో రోగాల బారినపడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు నట్టల వ్యాధి బారిన పడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడా పచ్చిమేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు సమస్య ఉత్పన్నమవుతుంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు ఉచితంగా వేస్తుంది. ప్రస్తుతం పశువైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నారు.

**గొంతువాపు ప్రాణాంతకం**

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారినపడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నివారణకు ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారినపడిన పశువును మిగిలిన వాటి నుంచి దూరం చేయాలి.

**వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్**

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకువ్యాధి. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణ కోసం జూన్, జూలై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించాలి.

**గాలి కుంటుతో నీరసం**

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి సోకుతుంది. ఈ వ్యాధి బారినపడిన పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల మధ్య ఉంటుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగ్గా తీసుకోలేవు. నీరసించి, నడిచేందుకూ ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

**పీడించే జలగ**

మురుగునీరు, కాలువల్లో అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల జలగ వ్యాధి ప్రబలుతుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు వస్తుంది. పశువులు మేత మేయడంలో ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 10 మిల్లీలీటర్లు నియోజడప్లస్ అందించాలి.

**ఆలస్యం చేయకూడదు**



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే వాటి ప్రభావం ఆరునెలల వరకూ ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరునెలలకోసారి వేస్తాం. గొంతువాపు, చిటుక వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో 1962 నంబర్‌కు కాల్ చేస్తే సిబ్బంది వచ్చి వైద్య సేవలను అందిస్తారు. ఎలాంటి సందేహాలు ఉన్న రైతులు పశువైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించవచ్చు.

– వి.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

# సమస్యలు పరిష్కరించాలి



సమ్మె కొనసాగిస్తున్న ఇంజినీరింగ్ వర్కర్స్

శ్రీకాకుళం: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్‌లు కోరారు. శ్రీకాకుళంలోని నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం 12వ రోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ వర్కర్స్ జీతాలు, నాన్ టెక్నికల్ జీతాలు పెంచాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సొంగల శంకరరావు, ముఖేష్ యాదవ్, జై కిషోర్, మజ్జి శ్రీను, సతీష్, రాఘవ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ కౌన్సిలింగ్ సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్టీటీ ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమక్షంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇచ్చిన హామీ మేరకు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను మాన్యువల్‌గానే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణలు ప్రభుత్వానికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆరోజు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సమక్షంలో ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మీద హామీ ఇచ్చారన్నారు. కానీ నిన్న రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులకి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ మెరుగైనదని, ఆన్‌లైన్ కౌన్సిలింగ్ కోసం ఆలోచించాలని పేర్కొనడం ప్రభుత్వ ద్వంద వైఖరికి, మోసపూరిత విధానానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికే బదిలీల దరఖాస్తుల సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన ఒక్క లోపాన్ని కూడా నేరుగా సరిచేయడం లేదని, ఎంఈవో లాగిన్‌లో సరి చేసుకోమని కిందిస్థాయి అధికారులకు అప్లికేషన్‌లో మార్పులు చేసే అధికారం ఇవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూలేని గందరగోళం ఇప్పుడు నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గందరగోళానికి తెరదించాలని కోరారు.

# యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సూచనలిస్తున్న అధికారులు

రణస్థలం: మండలంలోని ఉత్సాహవంతులైన వారిని గుర్తించి యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఇప్పటినుంచే యోగా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, అందుకు గ్రామస్థాయిలో అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

### కుండపోత వర్షం



జి.సిగడాం మండల కేంద్రంతోపాటు పెంట, నాగులవలస, మద్రివలస, సీతంపేట, పాలఖండ్యాం, గొబ్బూరు, మెట్టవలస, సంతవురిటి, ఆనందపురం, టిడివలస, గేదెలపేట, ఎస్పీఆర్‌పురం గ్రామాల్లో సోమవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

- జి.సిగడాం

### హుండీల లెక్కింపు రేపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని హుండీల లెక్కింపు బుధవారం ఉదయం 9 గంటలకు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో పి.శ్యామలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, అర్చకులు, పట్టణ ప్రముఖులు, దేవదాయశాఖ ప్రతినిధుల సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు.

### పరామర్శ



నివాళులర్పిస్తున్న కేవీజీ సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఇబ్రహింబాద్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీ విప్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు తమ్ముడు గోవిందరావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబ సభ్యులను విజయనగరం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకుడు కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.

### బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ శాంతిప్రియ

ఎచ్చెర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రీసోర్స్ పర్సన్ అరవెల్లి శాంతిప్రియ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

### నేటితో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు పూర్తి



వేంకటేశ్వరలో హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 19వ తేదీన ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్ -2025 పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి. ఈ పరీక్షలు సోమవారం రెండు షిప్టుల్లో నిర్వహించారు. చివరి రోజు ఒకే షిఫ్టులో పరీక్షలు నిర్వహించనున్నారు.

### పారిశుద్ధ్య పనులు



జి.సిగడాం మండలంలోని ఆనందపురం గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అన్ని వీధుల్లో చెత్త లేకుండా చర్యలు తీసుకొని, బ్లీచింగ్ వేశారు. చెత్తను ఊరికి దూరంగా డంపింగ్ యార్డుకి తరలించారు. సర్పంచ్ చిత్తిరి మంజు, పంచాయతీ కార్యదర్శి జాడ కిషోర్ తదితరులు పనులను పర్యవేక్షించారు.

- జి.సిగడాం

### ప్రమాదకరం



శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి ఆనుకుని ఉన్న ఆర్‌కే నగర్‌కాలనీలో రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ప్రమాదాలకు గురవుతున్నారు. కాంట్రాక్టర్లు పనులు చేసినప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సిమెంట్ రోడ్లు భూమిలోకి కుంగిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి కుంగిన రోడ్డుని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

### రోడ్డు పక్కనే చెత్త



ఎచ్చెర్లలోని రామ్‌నగర్ సమీపంలో రోడ్డు పక్కనే చెత్త నిల్వ అయ్యింది. వర్షాలు, గాలులకు రోడ్డుపైకి చెత్త వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్త సేకరణ, తొలగింపు లేకపోవడంతో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి, అపారిశుద్ధ్యం నెలకొంటోంది. అందువలన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

### విజేతలుగా తిరిగి రావాలి



ఎంపికైన క్రీడాకారులతో హారికాప్రసాద్, అడప రూనీ్స, కోచ్ మురళీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించి విజేతలుగా తిరిగి రావాలని స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎస్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా నరసారావుపేట వేదికగా జూన్ 1వ తేదీ నుంచి 11వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలు సోమవారం శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా ఉత్సాహభరితంగా సాగాయి. సీనియర్స్ విభాగంలో జరిగే ఈ ఎంపికలకు పలువురు క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రధాన కార్యదర్శి అడప రూనీ్స ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో డీఎస్‌డీవో కె.శ్రీధర్‌రావు, స్విమ్మింగ్ సంఘ ప్రతినిధులు ఎస్.కాంతారావు, వై.కాంతారావు పాల్గొన్నారు. కోచ్ మురళీధర్ ఎంపికలను నిర్వహించారు. ఇదిలా ఉండగా రాష్ట్రపోటీలకు ఎంపికైనవారిలో పురుషుల విభాగంలో ఎస్.ప్రియవర్ధన్‌రాజ్, మహిళల విభాగంలో దీక్షా బెహరా, వి.జాన్విక ఉన్నారు.

# ఎట్టకేలకు..!



వాడాడ కూడలి వద్ద రహదారికి అడ్డంగా బారికేడ్లను వేసిన దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయానికి చెందిన భూములను ఆక్రమించి అక్రమంగా లేఅవుట్‌కు రహదారి వేసుకున్న వైనంపై సాక్షిలో గత నెలలో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులకు ఎట్టకేలకు స్పందించారు. సర్వే నంబర్ 130లో ఆలయానికి చెందిన 0.87 సెంట్ల భూమిలో కొంతభాగాన్ని ప్రైవేటు లేఅవుట్ వ్యాపారాలకు అనుకూలంగా అక్రమంగా వేసిన రహదారి నిర్మాణాలను ఎట్టకేలకు అడ్డుకున్నారు. ఈ రహదారికి అడ్డంగా ఆలయానికి చెందిన ఐరన్ మెస్ బారికేడ్లను వేసి ఈ భూములన్నీ ఆలయానికి చెందినవని బోర్డును ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సోమవారం సాయంత్రం ఈ మేరకు పనులను పూర్తి చేశారు. ఇకపై ఆలయ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్

# కుండీల్లో మొక్కలు



మొక్కలతో పూల కుండీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్ వద్ద ఇటీవల పూల కుండీల్లో మొక్కలు ఎండిపోయి దర్శనమిచ్చాయి. దీంతో సాక్షిలో మొక్కలకు దిక్కెవరు అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఎండిన మొక్కలు తీసేసి పచ్చని మొక్కలు నాటారు. అంతేకాకుండా వైఎస్సార్ కూడలి నుంచి కళింగ రోడ్డులోని డివైడర్ వద్ద నేలవాలిన మొక్కలు, కుండీలు లేని మొక్కల్ని తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.

# తాగునీటికి ఇబ్బందులు..!

- మూలకు చేరిన రైతు బజారు వాటర్ ప్లాంట్
- దాహంతో ఇబ్బందులు పడుతున్న రైతులు





నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్



ట్యాప్‌ల వద్ద బోర్లించిన మట్టి కుండలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం రైతు బజారుకి నిత్యం వేలాది మంది కొనుగోలుదారులు, వందలాదిమంది అమ్మకందారులు వస్తుంటారు. అయితే ఇక్కడ దాహార్తిని తీర్చే నాథుడే లేకుండాపోయాడు. కొన్నేళ్ల క్రితం ఇక్కడ సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ఆర్‌వో ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్లాంట్ మూడు రోజులకే మూలకు చేరింది. అప్పటినుంచి ఇప్పటి వరకు దాన్ని మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు దాహార్తిని తీర్చుకోవడానికి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కుళాయిలు వచ్చిన సమయంలో బాటిల్స్‌తో పట్టుకుని, తర్వాత బయట కొనుక్కొని నీరు తాగాల్సిన పరిస్థితి ఉంది. ప్రతిరోజూ షాపులకు అద్దెలు చెల్లిస్తున్నా అందుకు తగ్గ సదుపాయాలు మాత్రం రైతుబజారులో కానరావడం లేదని రైతులు చెబుతున్నారు. మార్కెట్ అభివృద్ధికి లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేసినా మూణాళ్ల ముచ్చటగానే మిగిలిపోతోంది. మార్కెట్‌లో రైతులే కుండలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా కుండల్లో నీరుపోసేవారు లేక వాటిని సైతం బోర్లించి ఉంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్వో ప్లాంట్‌ని బాగుచేసి రైతులు, కొనుగోలుదారుల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

**సౌకర్యాలు లేవు**

రైతు బజారులో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌కి వచ్చేటప్పుడు దాహం వేస్తే కనీసం మంచినీళ్లు కూడా తాగడానికి దొరకడం లేదు. ఆర్వో ప్లాంట్ ఉన్నా ఉపయోగంలో లేకుండా పోయింది. మంచి నీరు కావాలంటే మార్కెట్ చేస్తున్న సమయంలో బయటకి వెళ్లి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి తాగాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తగిన ఏర్పాట్లు చేయాలి.

– ఆర్.త్రినాథరావు, కొనుగోలుదారుడు, శ్రీకాకుళం

**ఆధునీకరణకు నిధులు**



రైతు బజార్ల ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీనిలో ఆర్వో ప్లాంట్ బాగు చేయడానికి రూ.1.70 లక్షలు కేటాయించాం. టెండర్లను పిలిచి వీలైనంత తొందరలో పనులు పూర్తి చేస్తాం. రైతులు, కొనుగోలుదారులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం.

– బి.రవికిరణ్, మార్కెటింగ్ ఏడీ, శ్రీకాకుళం జిల్లా